క్లుప్తంగా

అటవీ భూమి ఆక్రమించిన వ్యక్తికి నోటీసులు



విజయపురిసౌత్ : అటవీ శాఖకు చెందిన భూములు అక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ అనిల్ కుమార్ హెచ్చరించారు. చింతల తండాకు చెందిన కేతావత్ శంకర్ నాయక్ అనే వ్యక్తి చింతల తండా– సాగర్ ప్రధాన రహదారి లోని తన పొలం పక్కనే ఉన్న అటవీశాఖ భూమిని అక్రమించాడు. దీంతో అధికారులు ఆదివారం ఘటనా స్థలానికి చేరుకొని శంకర్ నాయక్‌కు నోటీసులిచ్చారు. ఆక్రమిత స్థలంలో అటవీ మొక్కలు నాటనున్నట్లు అనిల్ కుమార్ తెలిపారు.

గురజాల సీఐ బాధ్యతల స్వీకరణ



గురజాల: గురజాల సీఐగా పి.భాస్కర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. గత సీఐ దాసరి ప్రసాద్ బదిలీపై వెళ్లారు. నూతన సీఐ భాస్కర్‌ను స్టేషన్ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి, అభినందనలు తెలిపారు.

మడేలయ్య స్వామికి బోనాలు



గురజాల: చర్లగుడిపాడు గ్రామంలో రజక కుల దైవం మడేలయ్య స్వామికి ఆదివారం శ్రావణ మాసం బోనాలు సమర్పించారు. టీడీపీ సీనియర్ నాయకుడు పల్చూరి నాగేశ్వర రావు అమ్మవారిని బోనాలు తీసుకెళ్లారు. స్వామివారిని గ్రామ వీధుల్లో ఊరేగించారు. రజకులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామికి మెక్కులు ఉన్నవారు బోనాలు సమర్పించారు. సుబ్బారావు, రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

పూర్ణచంద్రరావుకు డాక్టరేట్



దాచేపల్లి: మండలంలోని పొందుగలకు చెందిన పూర్ణచంద్రరావు జేజేటీయూ రాజస్థాన్ యూనివర్శిటీలో పీహెచ్‌డీ డాక్టరేట్ పట్టా పొందారు. ప్రొఫెసర్లు డాక్టర్ వివేక్, సీహెచ్ ఆనంద్‌కుమార్ పర్యవేక్షణలో యాంటీ హైపర్‌టెన్సివ్ ఔషధాల నోటి జీవలభ్యతను పెంచడానికి చేసిన నూతన పరిశోధనకు గాను వర్సిటీ డాక్టరేట్ పూర్ణచంద్రరావుకి ప్రదానం చేశారు.

వైఎస్సార్ సీపీ నాయకుడి మృతి



వెన్నపూసల వెంకట నారాయణ (ఫైల్)

కారెంపూడి: మండలంలోని పేటసన్నెగండ్ల గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు వెన్నపూసల వెంకటనారాయణ (బుల్లెబ్బాయ్) (57) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. పార్టీ మండలాధ్యక్షుడు కొంగర సుబ్రమణ్యం, సర్పంచ్ జవ్వాజి నాగేంద్రం పార్టీ నాయకులు నివాళులర్పించారు.

మందులు పంపిణీ



రెంటచింతల: మండలంలోని మల్లవరం, సత్రశాల, కొత్త గంగరాజుపల్లి గ్రామాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. గోలి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ వి. ప్రదీప్‌కుమార్‌రెడ్డి వైద్య సేవలందించారు. ఆరోగ్య, ఆశ కార్యకర్తలు గ్రామాల్లో మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి విషజ్వరాలపై ప్రజలకు అవగాహన కల్పించి నివారణ చర్యలను వివరించారు. పారిశుద్ధ్య చర్యలను వివరించారు. జ్వర లక్షణాలుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని చెప్పారు. ఏఎన్‌ఎంలు రవణమ్మ, రమాదేవి, పద్మ, అంజలి ఉన్నారు.

ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి



పిడుగురాళ్ల: పట్టణంలోని గంగమ్మ తల్లి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ పూజారులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, భక్తుల దర్శనార్థం ఉంచారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

జల దిగ్బంధం

- ఉధృతంగా ప్రవహిస్తున్న వంకలు, వాగులు
- నీట మునిగిన పంట పొలాలు
- ముంపు ప్రాంతాల్లో ఇళ్లలోకి చేరిన నీరు
- సహాయ చర్యల్లో అధికార యంత్రాంగం
- శాంతించిన వరుణుడు



ఉధృతంగా ప్రవహిస్తున్న దండివాగు

గురజాల: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం దాటికి గత రెండు రోజులుగా కురుస్తున్న వరుణుడు ఆదివారం శాంతించాడు. ఉదయం నుంచి సాధారణ చినుకులు పడ్డాయి. దీంతో ప్రజానీకం ఊపిరి పీల్చుకుంది. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. దండివాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. హైవేపై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. వెంకటరావు కాలనీలో దండివాగు వరద నీటిలో 15 ఇళ్లు నీట మునిగాయి. శ్రీనివాస ఫంక్షన్ హాల్‌లో పునరావాస కేంద్రం ఏర్పాటు చేశారు. వారికి అల్పాహారాన్ని మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, కౌన్సిలర్ బుల్లయ్య, హనుమంతరావు, కిషోర్, దానయ్య, నాగేంద్రబాబు అందజేశారు. దండివాగు పక్కనే ఉన్న పంట పొలాల్లోకి వరద నీరు చేరింది. వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు.

- కారెంపూడి: తుపాను ప్రభావం వల్ల కురిసిన భారీ వర్షాలకు ఒప్పిచర్ల గ్రామంలోని ఇసుక వాగు పేరుకుపోయిన వ్యర్థాలతో ఉప్పొంగింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. లోతట్టు ప్రాంతాలన్నీ నీట మునిగాయి. వేరు కుదురుకోని వరి నాట్లు కొట్టుకు పోయాయి. దీంతో ఒప్పిచర్ల గ్రామ రైతులకు నష్టం వాటిల్లింది. పలుచోట్ల రోడ్లపై చెట్లు విరిగిపడడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. ఆదివారం వర్షం తగ్గి ఎండ కాయడంతో రైతులు పొలాల్లో ఉన్న నీటిని బయటకు పంపే పనుల్లో నిమగ్నమయ్యారు.
- పిడుగురాళ్లరూరల్: అధిక వర్షాల వలన పంట నష్టపోయే రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు, సలహాలు పాటించాలి వ్యవసాయ శాఖ ఏవో శ్రీనివాసరెడ్డి తెలిపారు. పట్టణంలోని కామేపల్లి గ్రామంలో వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులకు ఆదివారం సూచనలు, సలహాలను అందజేశారు.
- దాచేపల్లి : ఆదివారం వర్షం కురవడంతో నాగులేరులోకి వరద నీరు భారీగా చేరి ప్రమాదకరంగా ప్రవహించింది. పత్తి, మిరప పంట పొలాలు నీట మునిగాయి. రోడ్లు బాగా దెబ్బతిన్నాయి. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.
- రెంటచింతల: రెంట చింతల గ్రామ శివారులోని గోలివాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. మాచర్ల– గుంటూరు మధ్య శనివారం సాయంత్రం 5 గంటల నుంచి ఆదివారం సాయంత్రం వరకు రాకపోకలు నిలిచిపోయాయి. గోలివాగుపైన ఉన్న తాత్కాలిక బ్రిడ్జి నీటి ప్రవాహానికి కొంత కొట్టుకునిపోయింది. బ్రిడ్జిపై పెద్ద గోతులు ఏర్పడ్డాయి. గోలి– జెట్టిపాలెం గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. స్థానిక ఏడుమంగళం వాగు ఉగ్రరూపం దాల్చింది. రెంటచింతల, మిట్టగుడిపాడు గ్రామాల పల్లపు పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. గోలివాగు వద్ద తాత్కాలిక బ్రిడ్జి కొట్టుకుపోవడంతో మాచర్ల నుంచి కారెంపూడి మీదుగా గుంటూరుకు బస్ సర్వీసులను నడుపుతున్నట్లు మాచర్ల ఆర్టీసీ డిపో మేనేజర్ రెంటపాళ్ల పిచ్చయ్య తెలిపారు. ప్రయాణికులు గమనించాలన్నారు.



గోలివాగు బ్రిడ్జి వద్ద నిలిచిపోయిన వాహనాల రాకపోకలు



చంద్రవంక వాగు వద్ద నీటి మళ్లింపును పరిశీలిస్తున్న తహసీల్దారు ఎండీ జియా ఉల్ హుక్, సిబ్బంది

పిడుగురాళ్ల: లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు అధికారులకు సమాచారం అందించాలని మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ అన్నారు. పట్టణంలోని బుడగ జంగాల కాలనీలో నిల్వ ఉన్న నీటిని పొక్లెయినర్ సాయంతో ఆదివారం తొలగించారు. స్థానికులకు తగు జాగ్రత్తలు చెప్పారు.

పిడుగురాళ్లరూరల్: పట్టణంలోని కోనంకి వెళ్లే రహదారి మార్గంలో వాగు పొంగి పొర్లుతూ ఉండటంతో ప్రజలు అటుగా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దీంతో స్పందించిన పట్టణ సీఐ శ్రీరాం వెంకట్రావు ప్రొక్లెయినర్, సిబ్బందిని తీసుకొని వెళ్లి నీటి ప్రవాహాన్ని తగ్గించే విధంగా చర్యలు తీసుకున్నారు. వెంటనే ప్రజలకు వాగు పొంగిపొర్లుతుంటే రోడ్డు దాటవద్దని, ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని దీనిని గుర్తించాలని ప్రజలకు అవగాహన కల్పించారు.

మాచర్ల: పట్టణంలో దశాబ్దం తర్వాత భారీ వర్షాలు కురిశాయి. మాచర్లలోని చంద్రవంకకు ఆదివారం భారీ స్థాయిలో వివిధ చెరువుల నీరు వచ్చి చేరుతోంది. దాదాపు 10 అడుగుల ఎత్తులో నీరు ప్రవహిస్తూ ఎత్తిపోతల జలపాతం వైపు పరుగులు తీస్తుంది. దీంతో మాచర్ల, జమ్మలమడక, తుమ్మకోటకు వెళ్లే రహదారిలో రాకపోకలు స్తంభించాయి. ఇరువైపులా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మున్సిపల్ కమిషనర్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పర్యవేక్షిస్తున్నారు. మొత్తంగా మూడు రోజుల్లో 23 సెం.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు చెప్తున్నారు.



మాచర్ల - జమ్మలమడక రహదారిలో ఉధృతంగా చంద్రవంక వాగు

- పిడుగురాళ్ల: పట్టణంలోని ఆర్టీసీ పక్క బజారులో చెరువుకు వెళ్లే ప్రాంతంలో రోడ్డు బుగ్గవాగు వల్ల కోతకు గురైంది. రాత్రి మున్సిపల్ కమిషనర్ శ్రీధర్, సీఐ శ్రీరాం వెంకట్రావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పొక్లెయినర్ సాయంతో నీటి ఉధృతిని తగ్గించే చర్యలు తీసుకున్నారు. ఆ ప్రాంతానికి విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. నీటి ప్రవాహం తగ్గిన తర్వాత గండిని పూడ్చే ప్రయత్నం చేస్తామని అధికారులు తెలిపారు.



పిడుగురాళ్ల పట్టణంలో బుగ్గవాగు వల్ల కోతకు గురైన రహదారి

500 కోళ్లు మృతి



మృతి చెందిన కోళ్లు

మాచవరం: భారీ వర్షాలకు కోళ్ల ఫారంలోకి నీరు చేరడంతో 500 కోళ్లు మృతి చెందాయి. వేమవరం గ్రామంలో రేఖపల్లి నర్సయ్య అనే రైతు ఈ కోళ్ల ఫారం నిర్వహిస్తున్నాడు. సుమారు రూ.2లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు.

మాచవరం: స్థానిక తహసీల్దారు క్షమారాణి, ఎస్‌ఐ కె.సతీష్ మండలంలోని వెల్లంపల్లి, రేగులగడ్డ, గోవిందాపురం గ్రామాల వద్ద కృష్ణా నది, ఎస్పీ తండా గ్రామాల్లోని పిల్లేరు వాగు వరద నీటి ప్రవాహాన్ని ఆదివారం పరిశీలించారు. పిల్లేరు వద్ద ఎవరూ వాగు దాటకుండా ఉండేందుకు సిబ్బందిని ఏర్పాటు చేశారు. హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి, స్థానికులకు తగు సూచనలు సలహాలు తెలియజేశారు. జాలర్లను చేపల వేటకు వెళ్ల వద్దని హెచ్చరికలు జారీ చేశారు.



వెల్లంపల్లి వద్ద వరద నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న అధికారులు



పొక్లెయినర్ సాయంతో పిడుగురాళ్ల వద్ద నీటి మళ్లింపు చర్యలు



కారెంపూడిలో రోడ్డుపై కూలిన చెట్టు



దండివాగు సమీపంలో నీట మునిగిన పంట పొలాలు



ఉధృతంగా ప్రవహిస్తున్న నాగులేరు



ఉధృతంగా ప్రవహిస్తున్న గోలి వాగు

పంట పొలాల పరిశీలన

గురజాల: వర్షాలకు నష్టపోకుండా రైతులు తమ పంటలను కాపాడుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి ఎం.సంధ్యారాణి సూచించారు. పలు గ్రామాల్లో పంట పొలాలను ఆదివారం ఆమె సందర్శించారు. పొలాల్లో నీటిని బయటకు పంపించాలని చెప్పి, నష్ట నివారణ చర్యలను వివరించారు. 90 రోజుల్లోపు పత్తి పంట పొలంలో ఎకరాకు 30 కిలోల యూరియా, 10 కిలోలు పొటాష్ వేయాలని చెప్పారు. తెగుళ్ల నివారణ మార్గాలను సూచించారు. వర్షం ఆగేంత వరకు రైతులు పంట పొలాలను పరిశీలించాలన్నారు. అనుమానాలుంటే సత్వరమే వ్యవసాయశాఖ సిబ్బందికి తెలపాలన్నారు.

పత్తి, వరి సంరక్షణకు చర్యలు తీసుకోవాలి

దాచేపల్లి: భారీ వర్షాల నుంచి పత్తి, వరి పంటలను కాపాడుకునేందుకు రైతులు తక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయశాఖ అధికారి దొండేటి పాపకుమారి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వరి పంట పొలంలో వర్షపు నీటిని తొలగించి, 30 కిలోల యూరియా, 15 కిలోల ఎంఈవోపీ వేయాలన్నారు. బీఎల్‌బీ వచ్చే అవకాశం ఉండటం వల్ల పొటాష్ తప్పనిసరిగా పంటలో వేయాలని పేర్కొన్నారు. నెల రోజుల లోపు పంటలో మొక్కలు చనిపోతే ఒత్తుగా ఉన్న చోట మొక్కలు పీకి నాటాలని తెలిపారు. పత్తి పంటలో నిలిచిన నీటిని తొలగించి మల్టీ–కె(13.0.45) 10 గ్రాముల లేదా పోలిఫీడ్(19.19.19) 10 గ్రాముల లేదా యూరియా 20 గ్రాములు, 10 గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్ లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. తెగుళ్ల నివారణ మార్గాలను వివరించారు.



రైతులతో మాట్లాడుతున్న ఏవో సంధ్యారాణి

మిర్చి పంటను కాపాడుకోండి..

మాచర్ల: భారీ వర్షాలకు పంటలు నష్ట పోకుండా రైతులు జాగ్రత్తలు పాటించాలని మాచర్ల సహాయ వ్యవసాయ సంచాలకుడు జగదీష్‌రెడ్డి కోరారు. ఆదివారం మార్కెట్ యార్డులోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతులు పొలాల్లో నీరు నిలబడితే పత్తి పంట ఎర్రబారే అవకాశముందని, వర కాలువలు తీసి నీరు నిలవకుండా చూసుకోవాలన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

మాచర్ల రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించి, ఉద్యోగ, ఉపాధ్యాయుల భవిష్యత్తును కాపాడాలని ఏపీటీఎఫ్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఎదుట ధర్నా నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కేంద్రీకృత పెన్షన్ విధానం (యూపీఎస్) ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదని వారు అన్నారు. జిల్లా కార్యదర్శి ఈవీ రవికుమార్, ఉపాధ్యక్షుడు కృష్ణారావు, రాష్ట్ర కౌన్సిలర్ శివానంద్, శ్రీనివాసరావు, రమేష్ బాబు, బాదరయ్య తదితరులు తహసీల్దారు ఎండీ జియా ఉల్ హక్‌కు వినతిపత్రం వారు అందజేశారు.



తహసీల్దారు కార్యాలయం ఎదుట ఏపీటీఎఫ్ నాయకుల ధర్నా

నేడు వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలు

రెంటచింతల: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని స్థానిక మాచర్ల–గుంటూరు ప్రధాన రహదారి వెంబడి ఉన్న వైఎస్సార్ కాంస్య విగ్రహం వద్ద సోమవారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గొట్టం బ్రహ్మారెడ్డి, రెంటచింతల–3 ఎంపీటీసీ గాలి ప్రతాప్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని తెలిపారు.

- దాచేపల్లి : వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలను సోమవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం, రాజశేఖరరెడ్డి విగ్రహాల వద్ద నిర్వహించనున్నట్లు పార్టీ మండల, పట్టణ కన్వీనర్లు కోట కృష్ణ, షేక్ సుభానీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

పిడుగురాళ్ల: పట్టణంలో సోమవారం వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. వైఎస్సార్ విగ్రహాలకు నివాళులర్పించి, అన్నదానం చేస్తున్నట్లు వెల్లడించింది. మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి కూడా హాజరు కానున్నారని, పార్టీ శ్రేణులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని పేర్కొన్నారు

నేడు పాఠశాలలకు సెలవు

మాచవరం: తుపాను కారణంగా సోమవారం మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సెలవు ప్రకటించినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వాతావరణ శాఖ హెచ్చరికలు నేపథ్యంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

ఉపవాస ప్రార్థనలు

మాచర్ల: ఏసుక్రీస్తు బోధనలు నిత్యం ఆచరించి, పాటించాలని పాస్టర్ వై.ఎలీషా కోరారు. పాత మాచర్లలోని రథం బజారు వెనుక మరనాత మందిరంలో 40 రోజుల ఉపవాస ప్రార్థనలు జరుగుతున్నాయి. ఆదివారం చర్చిలో పాస్టర్ ఎలీషా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉపవాస ప్రార్థన ద్వారా క్రైస్తవులు ఏసుక్రీస్తు కృప పొందాలన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

పిడుగురాళ్ల: గురజాల నియోజకవర్గంలోని ప్రజలంతా అమప్రత్తంగా ఉండాలని గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనవాసరావు అన్నారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. కృష్ణానది పరీవాహక ప్రాంతాల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని, అధికారులు కూడా ఎప్పటికప్పుడు ప్రజలకు సహాయక చర్యలు అందిస్తుండాలని తెలిపారు. ప్రజలు కాలువలను దాటే యత్నం చేయొద్దన్నారు.

రక్తదాన శిబిరం అభినందనీయం

పిడుగురాళ్ల: రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమని డాక్టర్ ఉన్నం నాగమల్లి కార్జునరావు అన్నారు. పట్టణలోని కె–1 పంక్షన్ హాల్‌లో ఆదివారం రక్తదాన శిబిరం జనసేన పార్టీ మండలాధ్యక్షుడు కామిశెట్టి రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అన్ని దానాల్లో కన్నా రక్తదానం మిన్న అని ఆయన తెలిపారు. మండల అధ్యక్షుడు కామిశెట్టి రమేష్ మాట్లాడుతూ.. రక్తదాన శిబిరానికి అనూహ్య స్పందన వచ్చిందన్నారు. వంద మంది వరకు రక్తదానం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ నాగమల్లికార్జునరావు

విద్యుత్ మీటర్లను ఆపేయండి

పిడుగురాళ్ల: కురుస్తున్న వర్షాల కారణంగా వ్యాపార దుకాణాలు మూసి వేసే సమయంలో మీటర్లను ఆఫ్ చేసి, వెళ్లాలని విద్యుత్ శాఖ ఏఈ ఆరికట్ల శివనాగిరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన విలేకరల సమావేశంలో మాట్లాడారు. పట్టణంలోని కురుస్తున్న వర్షాలకు అండర్ గ్రౌండ్‌లోని షాపుల వారు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. మీటర్లు ఆఫ్ చేయకపోతే విద్యుత్ ప్రమాదానికి దారితీయవచ్చన్నారు.

కారు ఢీకొని యువకుడి మృతి

దాచేపల్లి : కారు ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన శనివారం రాత్రి జరిగింది. ఈ ఘటనలో మండలంలోని శ్రీనగర్‌కి చెందిన పోచబోయిన నరేష్(19) దుర్మారణం చెందాడు. ఎస్‌ఐ దాసరి శివనాగరాజు వివరాల మేరకు.. శ్రీనగర్ నుంచి ద్విచక్ర వాహనపై వస్తున్న నరేష్‌ను హైదరాబాద్ నుంచి అతివేగంగా వస్తున్న కారు ఢీకొట్టింది. నరేష్ అక్కడిక్కడే మృతి చెందాడు. ఘటన స్థలాన్ని ఎస్‌ఐ శివనాగరాజు పరిశీలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

అమ్మవార్లకు బోనాలు

మాచర్ల: పట్టణంలో పలు అమ్మవార్ల దేవాలయాల్లో శ్రావణ మాసం ముగింపు సందర్భంగా ఆదివారం ప్రత్యేకంగా అలంకరణలు గావించారు. భక్తులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు దత్తు, అధ్యక్షులు భవనాశి వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు. పోలేరమ్మ ఆలయానికి వందలాది మహిళా భక్తులు బోనాలతో చేరుకున్నారు. ప్రదక్షిణల అనంతరం బోనాలు సమర్పించారు. కుంకుమ బండ్లు కట్టి ఊరేగింపు జరిపారు. మైసమ్మ దేవాలయంలో అమ్మవారికి భక్తులు బోనాలు సమర్పించారు. అన్నదానం చేశారు.



పోలేరమ్మకు బోనాలు తీసుకెళ్తున్న భక్తులు